క్లుప్తంగా

ఘనంగా ఎస్వీఆర్ కళా స్రవంతి వార్షికోత్సవం



ఎస్వీ రంగారావు కళా పురస్కారాన్ని అందుకుంటున్న ధర్మరాజు

బోట్‌క్లబ్: ఎస్వీ రంగారావు కళాస్రవంతి 11వ వార్షికోత్సవం శుక్రవారం స్థానిక దంటు కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి పి.వెంకన్నబాబు ఆధ్వర్యంలో ఎస్వీ రంగారావు రాష్ట్ర స్థాయి కళా పురస్కారాలను కర్రి ధర్మరాజు (హరి), పేర్నీడి సూర్యనారాయణకు, ఎస్వీ రంగారావు రాష్ట్ర స్థాయి రంగస్థల పురస్కారాన్ని విజయవాడకు చెందిన నటి కుసుమసాయికి అందించారు. సంస్థ అధ్యక్షులుగా ఎన్నికైన పి.చంటిరెడ్డిని ఈ సందర్భంగా సత్కరించారు. తొలుత నాట్యాచార్య ఎంవీ రమణ శిష్య బృందం ఇచ్చిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. అనంతరం ఆచమనం నాటిక ఆహూతులను ఆకట్టుకుంది. నాటికలోని పలు సన్నివేశాలు ప్రేక్షకులను హత్తుకున్నాయి. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణ్‌కుమార్, వీవై దాసు, దవులూరి సుబ్బారావు, గట్టి సత్యనారాయణ, దేగల రమేష్ పాల్గొన్నారు.

వేర్వేరుగా తడి, పొడి చెత్త ఇవ్వాలి



అంబేడ్కర్‌నగర్ కాలనీలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

కరప: పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చినప్పుడు తడి, పొడిచెత్తను వేర్వేరుగా ఇవ్వాలని ఎంపీడీఓ ఎం.అనుపమ కోరారు. స్థానిక అంబేడ్కర్‌నగర్ కాలనీలో శుక్రవారం ఆమె పంచాయతీ సిబ్బందితో కలిసి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. మహిళలకు తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అనుపమ మాట్లాడుతూ, ఇంటి వద్దే ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా పంచాయతీ వారిచ్చిన డస్ట్‌బిన్లలో వేయాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు, సబ్బులు, పేస్టులు, టూత్‌బ్రష్‌లు వంటి వాటిని, కవర్లను ఒకదానిలో వేసుకోవాలన్నారు. కాయగూరలు, ఆకుకూరలు వంటి వెజిటబుల్స్ కోయగా వచ్చిన తడి చెత్తను వేరు చేసి, పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. వాటర్ ట్యాంక్‌లను వారానికొకసారి శుభ్రం చేయాలన్నారు. గృహాల్లో, ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి యు.నిర్మలాదేవి ఆమె వెంట ఉన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలు

బోట్‌క్లబ్: కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని 101 సచివాలయాల్లో ఐదేళ్లు ఒకేచోట పనిచేసిన ఉద్యోగులను కార్పొరేషన్ పరిధిలోనే బదిలీలు చేశారు. వీరిలో ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు 79 మంది, వెల్ఫేర్ సెక్రటరీలు 80 మంది, అడ్మిన్ సెక్రటరీలు 54 మంది, శానిటేషన్ సెక్రటరీలు 65 మంది, ప్లానింగ్ సెక్రటరీలు 65 మంది, ఇమ్యూనిటీ సెక్రటరీలు 57 మంది ఉన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి

కాకినాడ రూరల్: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య వర్ధంతి సందర్భంగా సర్పవరం జంక్షన్‌లో శుక్రవారం ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఆర్మీ ఉద్యోగి శ్రీనగేష్ మాట్లాడుతూ, పింగళి వెంకయ్య తెలుగు ముద్దు బిడ్డ కావడం గర్వకారణమన్నారు. ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న బాలకృష్ణ

బోట్‌క్లబ్: ప్రతిభ గల విద్యార్థులకు రెడ్‌కాన్వెంట్ స్టూడెంట్స్ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని ట్రస్ట్ అధ్యక్షుడు బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌లో శుక్రవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో పది మంది నిరుపేద విద్యార్థులకు రూ.2.40 లక్షల స్కాలర్‌షిప్‌లు అందించారు. ఎనిమిదేళ్లుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభ ఉన్న విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ట్రస్ట్ ట్రెజరర్ డీవీఆర్ జగన్నాథం, సభ్యులు సీమకుర్తి పాపారావు, ఎం.జనార్దన్, వీవీ రామ్‌చరణ్, ఆకుల సరళ పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

బోట్‌క్లబ్: ప్రతి శుక్రవారం స్థానిక దేవాలయం వీధిలోని బచ్చు రామేశం సత్రంలో నిర్వహిస్తున్న ఉచిత హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన లభిస్తుందని సత్రం వ్యవస్థాపక చైర్మన్ పైండా రామకృష్ణారావు అన్నారు. శుక్రవారం సత్రంలో నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులకు ఆయన ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మోసంలో బాబుది గిన్నిస్ రికార్డు

- హామీలు అమలు చేయకుండా బాబు, పవన్ దగా
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా
- పేదల కోసం పరితపించిన జగన్ : మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి
- పార్టీ కాకినాడ సిటీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు



కాకినాడ సిటీ విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ద్వారంపూడి, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, సుంకర, రాగిరెడ్డి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబుకు ప్రజలను మోసం చేయడంలో గిన్నిస్ రికార్డు ఇవ్వొచ్చని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా పార్టీ కాకినాడ సిటీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం కాకినాడ డి–కన్వెన్షన్‌లో శుక్రవారం సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజా మాట్లాడుతూ, చంద్రబాబు ఏనాడూ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయని వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయాడన్నారు. ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే అప్పులపై అప్పులు చేసి ఇప్పటికే రూ.లక్షా డబ్బై వేల కోట్లు అప్పులు చేసిన ఘనుడు చంద్రబాబు అని ధ్వజమెత్తారు. సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఎంత వరకు నెరవేర్చారో ప్రజలకు తెలియజేయాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడాలన్నారు. ప్రజల్ని ఆదరించి, కార్యకర్తలను కాపాడుకునే నాయకుడు వైఎస్ జగన్ అన్నారు.

కల్లబొల్లి హామీలతో ముంచేశారు

కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే, పార్టీ సిటీ కో–ఆర్డినేటర్ ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు చంద్రబాబు అరెస్ట్ అయితే, టీడీపీ నాయకులే రోడ్డుపైకి రాని పరిస్థితిని చూశామన్నారు. పేదల కోసం పరితపించి, పారదర్శకంగా అనేక సంక్షేమ పథకాలు అమలుచేసిన జగన్‌ను ఓడించడం ఎవరి వల్లా కాదన్నారు. రాష్ట్రంలో కూటమి ముఖ్యనేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి కల్లబొల్లి హామీలతో ప్రజలను మభ్యపెట్టి నిలువునా ముంచేశారని నిప్పులు చెరిగారు 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకొనే చంద్రబాబు ప్రజలను ఎలా దగా చేయాలో, వారిని నమ్మించి ఎలా ముంచేయాలో బాగా తెలుసన్నారు. గత ఎన్నికల్లో 146 హామీలు గుప్పించి, ప్రజలకు ఆశలు కల్పించి ఏడాదైనా కనీసం వాటిలో పది శాతం కూడా అమలు చేయకుండా మోసం చేశారన్నారు. ప్రజల శ్రేయస్సు కోరే నాయకుడు జగన్ అన్నారు. చంద్రబాబు మాదిరి జనాన్ని మోసం చేసే నాయకుడు కాదన్నారు. చంద్రబాబు గెలిచిన ప్రతిసారి దొంగ హామీలివ్వడం, ఆనక వాటిని అమలు చేయకుండా గాలిలో కలిపేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. చంద్రబాబు మొక్కుబడిగా అమలు చేసే పథకాలకు పవన్ కల్యాణ్ మద్దతు పలుకుతున్నారన్నారు. చంద్రబాబు పచ్చి మోసగాడు అని రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. కానీ చంద్రబాబుతో పథకాలు అమలు చేయిస్తానని పవన్ కల్యాణ్ చెప్పడంతో ప్రజలు నమ్మి కూటమికి ఓట్లు వేశారన్నారు. చంద్రబాబు లానే పవన్ కల్యాణ్ కూడా ప్రజల్ని మోసం చేశారన్నారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు.

కార్యకర్తలకు అండగా..

పార్టీ సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడే పార్టీ నేతలు మరింత కష్టపడి పనిచేయాలన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ నేతలు అండగా నిలవాలన్నారు. పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ, సంక్షేమ పథకాలను పారదర్శకంగా వర్గాలు, పార్టీలు, కులాలు చూడకుండా అమలుచేసిన నాయకుడు జగన్ మాత్రమేనన్నారు. ఆయన మాటకు కట్టుబడి, ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశారన్నారు. రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి ఎంవీజేఆర్ కిశోర్ మాట్లాడుతూ, సమస్యలపై ప్రజల పక్షాన ఉంటూ పార్టీ నేతలు, కార్యకర్తలు పార్టీ ప్రగతికి పాటు పడాలన్నారు. కాకినాడ సిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బర్ల సూరిబాబు, బీసీ సెల్ వాసుపల్లి కృష్ణ మాట్లాడుతూ, పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే వరకు ప్రతి నాయకుడు రేయింబవళ్లు ప్రజలకు వెన్నంటి నిలవాలన్నారు. పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు అల్లి రాజబాబు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు రాగిరెడ్డి అరుణ్‌కుమార్(బన్నీ), పార్టీ ప్రచార కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత, సిటీ యువజన విభాగం అధ్యక్షుడు రోకళ్ల సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు పసుపులేటి వెంకటలక్ష్మి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖాలిద్, హేమంతకుమార్, కృష్ణప్రియ, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పార్టీ అనుబంధ విభాగాలకు ఇటీవల నియమితులైన నాయకులను పార్టీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఘనంగా అల్లూరి జయంతి



కొవ్వాడ చాణక్య స్కూల్‌లో అల్లూరి జయంతి వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కాకినాడ రూరల్: మండలంలోని కొవ్వాడ చాణక్య స్కూల్‌లో స్వాతంత్ర్య విప్లవ యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలోని అల్లూరి విగ్రహానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్లూరి సీతారామరాజు వేషధారణతో ఓ విద్యార్థి ఆకట్టుకున్నాడు. అల్లూరి పోరాట పటిమను విద్యార్థులకు కరస్పాండెంట్ జీఎస్ చాణక్య, ఉపాధ్యాయులు వివరించారు.



అల్లూరి విగ్రహం వద్ద సీతారామరాజు వేషధారణలో విద్యార్థి

ప్రజా సమస్యలపై సర్పంచ్‌ల గళం

- మొక్కుబడి తంతుగా మండల పరిషత్ సమావేశం
- పూర్తిగా హాజరు కాని అధికారులు
- ఉపాధి పనులకు పంచాయతీ తీర్మానాలు తీసుకోవడం లేదని నిలదీత



సమస్యలపై ప్రశ్నిస్తున్న తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ

కాకినాడ రూరల్: గ్రామాల్లో పేరుకుపోతున్న ప్రజా సమస్యలపై వైఎస్సార్ సీపీకి చెందిన తిమ్మాపురం, నేమాం సర్పంచ్‌లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో గళమెత్తారు. ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి అధ్యక్షతన కాకినాడ రూరల్ మండల పరిషత్ సమావేశం శుక్రవారం ఉదయం జరిగింది. మొక్కుబడి తంతుగా సమావేశం జరగ్గా, పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ(కిట్టు) హాజరయ్యారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించడంతో పాటు, సభ్యుల ఆమోదంతో పలు తీర్మానాలు చేశారు. తిమ్మాపురం గ్రామంలో ఇళ్లు లేని చోట రోడ్ల నిర్మాణానికి కొలతలు తీసుకుంటున్నారని, ఉపాధి పనులకు పంచాయతీ తీర్మానాలు తీసుకోవడం లేదని తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ సమావేశం దృష్టికి తెచ్చారు. దీనిపై పంచాయతీరాజ్ డీఈ మాట్లాడుతూ, గ్రామ సభల్లో తీర్మానాలతో పాటు, ఎమ్మెల్యే సూచించిన పనులు మాత్రమే చేపడుతున్నామని, పంచాయతీ తీర్మానాలు లేకపోతే తమ దృష్టికి తేవాలన్నారు. జగనన్న లేఅవుట్‌లో మండలంలోని రమణయ్యపేట, వాకలపూడి, చీడిగ, వలసపాకల తదితర గ్రామాల ప్రజలు ఇళ్లను నిర్మించుకున్నారని, రేషన్ సరకులు కావాలంటే వారి గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. కాలనీలో రేషన్ షాపును ఏర్పాటు చేయాలని కోరారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కల్యాణ్ చక్రవర్తికి ఎమ్మెల్యే సూచించారు. నేమాం గ్రామంలో పలు సమస్యలను సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు(చిన్నా) వివరించారు. గ్రామంలో జల్‌జీవన్ మిషన్ కింద వాటర్ ట్యాంక్ నిర్మాణం అసంపూర్తిగా ఉందని, తక్షణం దానిని పూర్తి చేయాలని కోరారు. గ్రామంలో ఉన్న ఐదు బెల్ట్ షాపులను తొలగించాలన్నారు. వీధిదీపాల నిర్వహణ వ్యయం ఎక్కువగా ఉన్నందున, సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు అంగీకరిస్తే, స్థలం సమకూర్చుతామన్నారు.

సారాపై చర్చ

మండలంలో ఐదు సారా రహిత గ్రామాలను ఎంపిక చేశామని ఎక్సైజ్ ఎస్సై వరహాలు తెలిపారు. ప్రస్తుతం సర్పవరం, తమ్మవరంలో అమలు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు, మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్ రూమ్‌ల సంగతేమిటని ఎమ్మెల్యే నిలదీశారు. బెల్ట్ షాపుల రహితంగా మండలాన్ని తయారు చేయాలని కోరారు. తమ గ్రామంలో బెల్ట్ షాపులు తొలగించడం లేదని నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా వివరించారు. ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా.. రంగు మారిన నీటి సరఫరా జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మారుతీరామ్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామాల్లో కుళాయి నీరు పచ్చగా రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ తెలిపారు. ఏఈ మారుతీరామ్ మాట్లాడుతూ, పండూరు సీపీడబ్ల్యూ స్కీం వద్ద స్టోరేజీ ట్యాంక్ చాలా ఏళ్లుగా శుభ్రం చేయకపోవడంతో నీళ్లు పచ్చగా మారాయని చెప్పారు. స్టోరేజ్ ట్యాంక్ శుభ్రత పనులు చేపడతామని వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ పి.సతీష్, డిప్యూటీ ఎంపీడీఓ రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి వంగవీటి

- మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి. చిత్రంలో పార్టీ నాయకులు

సాక్షిప్రతినిధి, కాకినాడ: అలుపెరుగని పోరాట యోధుడు వంగవీటి మోహన్‌రంగా పేదల పెన్నిధి అని కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కొనియాడారు. నిరంతరం పేదల కోసం పరితపించిన మహామనిషి రంగా అన్నారు. భౌతికంగా ఆయన మన మధ్య లేకున్నా, ఆయన ఆశయాల స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పేదల కోసం పనిచేయాలన్నారు. కాకినాడ కొండయ్యపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి జంక్షన్‌లో రంగా మిత్ర మండలి ప్రతినిధి గుడాల రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం వంగవీటి మోహన్‌రంగా 78వ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కాకినాడ సిటీ కో–ఆర్డినేటర్ ద్వారంపూడి ముఖ్యఅతిథిగా హాజరై, రంగా విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ద్వారంపూడి మాట్లాడుతూ, తాను రాజకీయాల్లో నేడు ఈ స్థాయిలో ఉన్నానంటే అందుకు ముగ్గురే కారణమన్నారు. వంగవీటి మోహన్‌రంగాతో పాటు, దివంగత జక్కంపూడి రామ్మోహనరావుతో రాజకీయాల్లో ఓనమాలు నేర్చుకుంటే, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి రాజకీయాల్లో ముందుకు నడిపించారన్నారు. రంగా కుటుంబానికి తాను ఎంతో రుణపడి ఉంటానన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు చేసిన రంగా నేటి రాజకీయాల్లో యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సిటీ అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, పార్టీ మహిళా రాష్ట్ర కార్యదర్శి రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు అల్లి రాజబాబు, పార్టీ అధికార ప్రతినిధి సుంకర విద్యాసాగర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు రాగిరెడ్డి అరుణ్‌కుమార్(బన్నీ), కత్తిపూడి శ్రీను, ఐ.శ్రీను, కొలగాని దుర్గాప్రసాద్, కర్రి అనంత, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై సమగ్ర తనిఖీ

- ఎస్ఆర్పీ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్పీ సత్యనారాయణ

కరప: మండలంలో జరిగిన ఉపాధి పనులను సోషల్ ఆడిట్‌ను డీఆర్పీలు సమగ్రంగా తనిఖీ చేసి, నివేదికలు రూపొందించాలని స్టేట్ రిసోర్స్‌పర్సన్ సీహెచ్ఎన్ సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం సోషల్ ఆడిట్ బృందం, ఉపాధి హామీ పథకం సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 18వ విడత సామాజిక తనిఖీ జరుగుతోందన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు రూ.13.27 కోట్ల విలువైన 1,222 పనులు జరిగాయన్నారు. ఇందులో ఉపాధిహామీ పనులతో పాటు, పంచాయతీరాజ్, సమగ్ర శిక్షా అభియాన్‌కు సంబంధించి వివిధ పనులు జరిగాయన్నారు. ఉపాధి వేతనాలుగా రూ.8,33,74,133, మెటీరియల్‌కు రూ.4,93,85,351 ఖర్చు చేశారన్నారు. ఆయా పనులతో పాటు, సామాజిక పింఛన్ల తనిఖీ జరుగుతుందన్నారు. గ్రామాల వారీగా డీఆర్పీలు ఉపాధి పథకం నిధులతో చేసిన పనులు, పింఛన్ల పంపిణీని తనిఖీ చేస్తారన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, డీఆర్పీలు గ్రామాల వారీగా తుది నివేదికను రూపొందిస్తారన్నారు. అనంతరం మండల స్థాయిలో సామాజిక తనిఖీపై సమీక్ష జరుగుతుందని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు, ఏపీఓ వై.హేమమాధవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

– పదోన్నతులు కల్పించాలని డిమాండ్




ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న యూనియన్ సభ్యులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఆరు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు వెంటనే ఇవ్వాలని ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్ ఇందేష్ డిమాండ్ చేశారు. కాకినాడ ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పదివేల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. డబుల్ డ్యూటీ అమౌంట్ పెంచాలని, పాత పద్ధతిలోనే వైద్య సౌకర్యాలు కలిపించాలన్నారు. పెండింగ్ డీఏ బకాయిలు, 11వ పి.ఆర్.సి పెండింగ్, 24 నెలల బకాయిలు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌లను వెంటనే చెల్లించాలన్నారు. 750 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేసి, ఆర్టీసీ సిబ్బందితోనే నడపాలన్నారు. ఆర్టీసీ డిపోలను ప్రైవేటు వ్యక్తులకు లీజుకిచ్చే విధానం మానుకోవాలన్నారు. మెడికల్ అన్ ఫిట్ అయిన ఉద్యోగుల పిల్లలకు, విధుల్లో చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. డిపో కార్యదర్శి డీవీ రావు మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ఈ ఉచిత బస్సు పథకం సక్రమంగా నడవాలంటే 2,500 బస్సులు, పదివేల సిబ్బంది అవసరమవుతారన్నారు. వెంటనే నూతన సిబ్బందిని, కొత్త బస్సులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గ్యారేజ్ కార్యదర్శి వై శ్రీనివాస్, అవుట్ సోర్సింగ్ జిల్లా కార్యదర్శి టీపీ కుమార్, డీఎస్ వాసు, కే సుధాకర్, ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్

కాకినాడ సిటీ: ఏపీపీఎస్‌సీ గ్రూప్–2 సర్వీసెస్, ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డులో అనలిస్ట్ గ్రేడ్–2 పోస్టులకు నియామకం కోసం సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం తాత్కాలికంగా అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శనివారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు, మధ్యాహ్నం 1 నుంచి 2 గంటలు, 4.30 నుంచి 5.30 వరకు కాకినాడ జిల్లాలో సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో జరుగుతుందని డీఆర్వో వివరించారు. అభ్యర్థులను ఉదయం 8.30 నుంచి 9.15 గంటల వరకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.45 గంటల వరకు, 3.30 నుంచి 4.15 గంటల వరకు పరీక్షా కేంద్రం లోపలికి అనుమతిస్తారన్నారు.

ఎన్‌సీసీలో సైక్లింగ్ క్లబ్ ప్రారంభం



సూర్యారావుపేట బీచ్‌లో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న నార్సింగ్ సైలాని

కాకినాడ రూరల్: సూర్యారావుపేట బీచ్‌లో ఎన్‌సీసీ సైక్లింగ్ క్లబ్‌ను ఎన్‌సీసీ ఆంధ్రా, తెలంగాణ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ నార్సింగ్ సైలాని శుక్రవారం ప్రారంభించారు. ఎన్‌సీసీ కేడట్లతో ఆయన సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నార్సింగ్ సైలాని మాట్లాడుతూ, శారీరక ఫిట్‌నెస్‌ను, దృఢత్వాన్ని పెంచడానికి సైక్లింగ్ సాధారణమైన, శక్తివంతమైన మార్గమన్నారు. అనంతరం కాకినాడ గ్రూప్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించారు. గ్రూప్ కమాండర్ కల్నల్ ఆర్ఎం అగర్వాల్ స్వాగతం పలికారు.

చదువులమ్మకు స్వర్ణ శోభితం

- ఏళ్ల కృషి, పట్టుదలకు పట్టాభిషేకం
- జేఎన్‌టీయూకేలో పతకాలు ప్రదానం చేసిన గవర్నర్ నజీర్




గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న ఎస్పీ బిందుమాధవ్



భార్యతో పీహెచ్‌డీ పట్టా పొందిన అభ్యర్థి

బాలాజీచెరువు: సరస్వతుల హర్షధ్వానాలతో స్థానిక జేఎన్‌టీయూకే ప్రాంగణం దద్దరిల్లింది. జేఎన్‌టీయూకే కన్వొకేషన్ హాల్లో శుక్రవారం 11వ స్నాతకోత్సవం కన్నుల పండగగా జరిగింది. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు వీక్షిస్తుండగా, విద్యార్థులు సగర్వంగా పట్టాలు అందుకున్నారు. గవర్నర్ చేతులమీదుగా స్వర్ణ పతకాలు, అతిథుల చేతుల మీదుగా పీహెచ్‌డీలు అందుకున్న కొందరు భావోద్వేగానికి గురయ్యారు. అరుదైన సన్నివేశాలు, సెల్ఫీలు తమ సెల్‌ఫోన్లలో బంధించి మురిసిపోయారు. పట్టరాని ఆనందాలు వారి మాటల్లోనే..


బ్యాంకింగ్ రంగంలో స్థిరపడాలి



నా పేరు కలిశెట్టి పావని. విజయవాడ పొట్టి శ్రీరాములు కళాశాలలో సీఎస్ఈ అభ్యసించి యూనివర్సిటీ టాపర్‌గా నిలిచాను. ఐటీ, బ్లాక్‌చైన్, సైబర్ సెక్యూరిటీ అంశాల సీఎస్ఈ విభాగంలో బంగారు పతకం సాధించాను. జీవితంలో ఇది మధుర ఘట్టంగా నిలిచిపోతుంది.

– కలిశెట్టి పావని, గోల్డ్ మెడలిస్ట్


చాలా సంతోషంగా ఉంది



నా పేరు పొణ్యం భానులత. బీటెక్‌లో 8.3 శాతం ఉత్తీర్ణత సాధించి బంగారు పతకాన్ని గవర్నర్ చేతుల మీదుగా అందుకోవడం సంతోషంగా ఉంది. చలపల్లి ఇన్‌స్టిట్యూట్‌లో గుంటూరులో అభ్యసించాను.

– పొణ్యం భానులత, గోల్డ్ మెడలిస్ట్

ఎంటెక్ అభ్యసిస్తాను



నా పేరు షేక్ ఫర్జానా. విజయవాడ సెయింట్ ఆన్స్ కళాశాలలో సీఎస్ఈ ఇంటర్నెట్ ఆఫ్ థింకింగ్ సబ్జెక్టులో 8.3 శాతం సాధించి స్వర్ణ పతకం పొందాను. ఎంటెక్ అభ్యసించి మంచి ఉద్యోగం సాధించాలనేది నా ఆశయం. సమాజ సేవ చేయాలనేది నా లక్ష్యం.

– షేక్ ఫర్జానా, గోల్డ్ మెడలిస్ట్

మరిచిపోలేని అనుభూతి




నా పేరు ఎస్.అజీజ్. నరసారావుపేట ఏఎం రెడ్డి కళాశాలలో బీటెక్ సైబర్ సెక్యూరిటీ విభాగంలో 7.4 జీపీఏతో గోల్డ్ మెడల్ సాధించాను. గవర్నర్ చేతుల మీదుగా మెడల్ తీసుకోవడం మరచిపోలేని అనుభూతి. మంచి ఉద్యోగం సాధించి, సమాజ సేవ చేయాలనేది నా ఆశయం.

– ఎస్.అజీజ్, గోల్డ్ మెడలిస్ట్

అల్లూరి ఆశయ సాధనకు కృషి

– మన్యం వీరుడి జయంతి వేళ వక్తల పిలుపు



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మూడో బెటాలియన్ కమాండెంట్ నాగేంద్రరావు

కాకినాడ సిటీ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. అల్లూరి జయంతి సందర్భంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ నెల 9న చేపట్టే సార్వత్రిక సమ్మెను అల్లూరి స్ఫూర్తితో విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. సీఐటీయూ జీజీహెచ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జీజీహెచ్ ప్రాంగణంలో అల్లూరి చిత్రపటానికి పెన్షనర్ల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు, జీజీహెచ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఎ.గోపాలకృష్ణ జోహార్లు అర్పించారు. తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీలో కాలనీవాసులు అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. సీతారామరాజు విగ్రహానికి చింతపల్లి అజయ్‌కుమార్, జోగా అప్పారావు, తేజ, వీరబాబు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

కాకినాడ రూరల్: మన్యం వీరుడు అల్లూరి జయంతిని స్థానిక రమణయ్యపేట ఏపీఎస్పీ మూడో బెటాలియన్‌లో నిర్వహించారు. కమాండెంట్ ఎం.నాగేంద్రరావు, అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, సిబ్బంది అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీ, సిబ్బంది అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. రమణయ్యపేటలో వీహెచ్‌పీ కాకినాడ శాఖ ఆధ్వర్యంలో, వలసపాకల సుందరయ్యకాలనీలో సీఐటీయూ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి జరిగింది.

కరప: అల్లూరి జయంతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, ఎంపీడీఓ ఎం.అనుపమ, సిబ్బందితో కలిసి నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. అల్లూరి పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని ఎంపీపీ కొనియాడారు. ఏఓ బీఎల్ నరసింహం, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పించారు.